సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం, 10, మార్చి, 2025



సోమశిలలో 56.646 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 56.646 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ కాలువలకు 2,250 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు	(10 గ్రా)	రూ.88,790
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)		రూ.8,040
3 శాతం జీఎస్టీతో		రూ.8,281
నవర (8 గ్రా)		రూ.66,248

గరిష్టం/కనిష్టం
33.0 /23.9

వాతావరణం

జిల్లాలో వాతావరణం సోమవారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ ఆదివారం 61 శాతంగా నమోదైంది.

ఇఫ్తార్ | సహర్
సోమవారం | మంగళవారం
సా: 6.20 | ఉ: 5.01
రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

అందుబాటులో హాల్ టికెట్లు

నెల్లూరు (టౌన్): ఏపీ ఓపెన్ స్కూల్ పదో తరగతి అభ్యాసకుల హాల్‌టికెట్లు సంబంధిత స్టడీ సెంటర్లలో అందుబాటులో ఉన్నట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఈ నెల 17 నుంచి 28వ తేదీ వరకు జరుగుతాయన్నారు. హాల్ టికెట్లను వాట్సాప్–మనమిత్ర ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

కనువిందు చేసిన నృత్య ప్రదర్శన



విద్యార్థుల నృత్యప్రదర్శన

నెల్లూరు (బృందావనం): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నగరపాలక సంస్థ, జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలలకు చెందిన 1,116 మంది విద్యార్థులు నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక నృత్య ప్రదర్శన నిర్వహించారు. 'మొక్కజొన్న తోటలో' జానపద గేయానికి అనుగుణంగా సాగిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులకు కనువిందు చేసింది. ఈ కార్యక్రమానికి వండర్‌బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, భారత్ రికార్డు, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు తదితర సంస్థల ప్రతినిధులు హాజరై వీక్షించారు. విద్యార్థులు, నిర్వాహకులకు ఆయా సంస్థల ప్రతినిధులు సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన పలువురు పాల్గొన్నారు.

పచ్చని పంట భూముల్లో బీపీసీఎల్ పిడుగు


ఏకపక్షంగా ఆ సంస్థ వైఖరి



హైదరాబాద్

భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ దుర్మార్గ వైఖరి.. వరి రైతులకు శరాఘాతంగా మారింది. కృష్ణపట్నం పోర్టు నుంచి హైదరాబాద్ వరకు బీపీసీఎల్ సంస్థ ఆయిల్ సరఫరాకు పైప్‌లైన్ నిర్మిస్తోంది. పచ్చని పంటలను ధ్వంసం చేసి తమ పైప్‌లైన్ ఏర్పాటు చేయడానికి దుందుడుకుతనంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే ఈ సంస్థ తీరుపై పైప్‌లైన్ వెళ్లే మార్గంలోని రైతులు కస్సుబుస్సులాడుతున్నారు. ఈ సమస్యపై రైతు సంఘాలు, వామపక్ష పార్టీలు సైతం కలెక్టర్‌ను కలిసి పంట కాలం పూర్తయ్యే వరకు ఈ పనులు నిలిపివేయాలని విజ్ఞప్తి చేశాయి. రైతులకు జరిగే నష్టాన్ని అంచనా వేయకుండా బీపీసీఎల్ ఏకపక్షంగా వ్యవహరిస్తుంటే ఇందుకు పోలీసులు, అధికారులు వత్తాసు పలకడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

- పొలాల్లో చివరి దశలో వరి పైరు
- ఈ నెల 11 నుంచి పైప్‌లైన్ ఏర్పాటుకు యత్నాలు
- పంట దెబ్బతింటే సహించమంటున్న రైతులు



పచ్చటి పొలాల వద్దకు చేరిన పైప్‌లైన్

కావలి: వ్యవసాయ భూముల్లో బీపీసీఎల్ సంస్థ ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్ పల్లెల్లో రగడ సృష్టిస్తోంది. పంట చివరి దశలో ఉండగా ఆ భూములను ధ్వంసం చేసి పైప్‌లైన్ వేయడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయా భూముల్లో వరి పంట సాగులో ఉంది. కనీసం 20 రోజులు సమయం ఇస్తే పంట కోత పూర్తవుతుందని నచ్చ జెప్పినా బీపీసీఎల్ సిబ్బంది ఖాతరు చేయడం లేదు. మండలంలోని సర్వాయపాళెం, ఆనెమడుగు పంచాయతీల పరిధిలో పలు గ్రామాల మీదుగా ఈ నెల 11వ తేదీ నుంచి వరి సాగులో ఉన్న భూముల్లో పైప్‌లైన్ వేసి తీరుతామని బీపీసీఎల్ ప్రతినిధులు మంకుపట్టు పడుతున్నారు. మా భూముల్లో మాకు తెలియకుండా దౌర్జన్యంగా పైప్‌లైన్ వేయడమేంటని రైతులు ఆగ్రహిస్తున్నారు. వరి పైరు పాడైపోతే నష్ట పరిహారం ఇస్తామని బీపీసీఎల్ సిబ్బంది చులకన భావంతో చెబుతున్న మాటలు రైతుల్లో ఆగ్రహం రగిలిస్తోంది. గ్రామాల్లో పోలీసులు పహారా నడుమ పొలాల్లో పైప్‌లైన్ వేయడానికి అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న తీరుపై రైతులు కలత చెందుతున్నారు.



పైప్‌లైన్ నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్న దృశ్యం



పైప్‌లైన్ నిర్మించేందుకు జాయింట్‌లను జతచేసి పొడవాటి పైప్‌లైన్‌గా సిద్ధం చేసిన దృశ్యం

సన్నకారు రైతులు భూముల్లో నడి మధ్యన పైప్‌లైన్ వేసి పొలాలను ధ్వంసం చేసి రైతుల జీవనాధారం కోల్పోయే దుర్మార్గమైన వాతావరణాన్ని అధికారులు సృష్టిస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు.

నిర్మాణం ఎలాగంటే..

పైపులైన్ వేసేందుకు రూ.451 కి.మీ. పొడవునా 16 మీటర్ల వెడల్పున భూమిని స్వాధీనం చేసుకుంటారు. అందులో రెండు మీటర్ల వెడల్పులో ఆరు అడుగుల లోతు తవ్వుతారు. పైపులైన్‌కు ఒక వైపున మూడు మీటర్లు, మరో వైపు 11 మీటర్ల మేర ఖాళీ ఉంచుతారు. లైన్ కోసం తవ్విన మట్టిని ఒక వైపు పోసి, మెటీరియల్‌ను మరో వైపు నుంచి తీసుకెళ్తారు. 16 అంగుళాల పైపు వేసి తిరిగి ఆ మట్టిని పూడ్చేస్తారు. అనంతరం ఆ భూమిని రైతులకు అప్పగిస్తారు. ప్రతి 10 కి.మీ.కు ఒక చోట చెకింగ్ పాయింట్‌తో పాటు లైన్ పొడవునా సెన్సార్లు ఏర్పాటు చేయనున్నారు. పనులు పూర్తయిన తర్వాత రైతులు ఎప్పటిలా పంటలు సాగు చేసుకోవచ్చు. అయితే సాధారణ వ్యవసాయ పంటలు తప్ప వేర్లు బాగా లోపలికి వెళ్లి పైపును డ్యామేజీ చేసే మామిడి, జామాయిల్ వంటివి సాగు చేసే అవకాశం లేదు. పైపులైన్ నిర్మాణం తర్వాత ఆ ప్రాంతంలో పంటలు వేసుకోవచ్చు. అయితే పైపులైన్‌కుదెబ్బతినే స్థాయిలో పెద్దపెద్ద వృక్షాలు పెంచకూడదు.

పైప్ లైన్ ఎక్కడి నుంచి ఎక్కడికి

కృష్ణపట్నం పోర్టు నుంచి హైదరాబాద్ వరకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ రెండు రాష్ట్రాల్లో మొత్తం 451 కి.మీ. దూరం పైపులైన్ ఏర్పాటు చేయడానికి రూ.1,926 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించింది. ఏపీలో రూ.1,062 కోట్లు, తెలంగాణలో రూ.864 కోట్లు ఖర్చు చేస్తోంది. కృష్ణపట్నం పోర్టు నుంచి హైదరాబాద్ వద్ద ఉన్న మాధవరం వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి కృష్ణపట్నం పోర్టుకు వచ్చే ఇంధనాన్ని మాధవరం వద్ద ఏర్పాటు చేసిన పెట్రోలియం టెర్మినల్‌కు సరఫరా చేసేందుకు ఈ పైపులైన్‌ను నిర్మిస్తున్నారు. రాష్ట్రంలో 27 మండలాల పరిధిలో 99 గ్రామాల నుంచి పైపులైన్ వెళ్తుంది. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి తెలంగాణలోని నల్గొండ, యాదాద్రి, భువనగిరి, మేడ్చల్ జిల్లాల గుండా మాధవరం టెర్మినల్ వరకు నిర్మించనున్నారు. కృష్ణపట్నం పోర్టు నుంచి మాధవరం టెర్మినల్‌కు ఈ పైపులైన్ ద్వారా మోటార్ స్పిరిట్, హైస్పీడ్ డీజిల్, కిరోసిన్, ఏవియేషన్ టర్బర్ ఇంధనం సరఫరా చేస్తారు.

పైప్ లైన్ ఊహా చిత్రం



కృష్ణపట్నం పోర్టు

కోతయ్యే వరకు జరగనివ్వం



మూడు నెలలు పాటు రెక్కలు కష్టంతో సేద్యం పనులు చేసుకున్నాం. పంట కోతకు వచ్చింది. మీ పంట ఏమైపోతే మాకెందుకు.. మేం పైప్‌లైన్ వేసేసుకుని వెళ్లిపోతాం అంటున్నారు. కళ్ల ముందు పంట నేలపాలైపోతూ నాశనం అవుతుంటే రైతు అనే వాడికి ఎంత మానసిక క్షోభ ఉంటుందో వాళ్లకు అర్థం కావడం లేదు. కోతయ్యే వరకు పైప్‌లైన్ నిర్మాణ పనులు జరగనివ్వం.

– మన్నెం పొట్టియ్య, రైతు, సర్వాయపాళెం, కావలి మండలం

రైతులంటే అలుసైపోయారు



రైతులంటే అలుసైపోయారు. కోతకు వచ్చిన పైరును ఇంటికి చేర్చుకోనే వరకు కూడా ఓపిక పట్టలేమంటే ఎలా. పైప్‌లైన్ నిర్మాణ పనులు జరిగితే వారు పనులు చేసే చోటనే కాకుండా పైరంతా కూడా గింజ చేతికి రాదు. పైగా పైరుకు నష్ట పరిహారం ఇస్తామంటూ హేళన చేయడం దారుణం. బీపీసీఎల్ తేదీలు పెట్టి అదే చివరి గడువని హెచ్చరించే ధోరణిలో బెదిరిస్తే ఎవరూ బెదిరిపోరు. పంట ఇంటికి చేరే వరకు పొలాల్లో పైప్‌లైన్ పనులు జరగనివ్వం.

– రేమాల లిగారెడ్డి, రైతు, ఆనెమడుగు, కావలి మండలం

యువతకు అండగా వైఎస్సార్‌సీపీ ఉద్యమ బాట

- 12న ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నా
- 'యువత పోరు' పోస్టర్ ఆవిష్కరణలో మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



యువత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాకాణి, నేదురుమల్లి, ఆనం, కిలివేటి, మేరిగ తదితరులు

నెల్లూరు(బారకాసు): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా, ఉద్యోగావకాశాలు కల్పించకుండా టీడీపీ కూటమి ప్రభుత్వం విద్యార్థులను చదువులకు దూరం చేయడంతోపాటు నిరుద్యోగులను దగా చేస్తోందని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. అందుకు నిరసనగా ఈ నెల 12న విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగులతో కలిసి పోరుబాట చేపడుతున్నామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ తలపెట్టిన 'యువత పోరు'కు సంబంధించిన పోస్టర్‌ను పలు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, విద్యార్థి సంఘ నాయకులు, పార్టీ నాయకులతో కలిసి ఆదివారం కాకాణి నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. కాకాణి మాట్లాడుతూ చంద్రబాబు అన్ని రంగాల వారిని మోసం చేసినట్లుగానే విద్యార్థులను, యువతను కూడా మోసం చేస్తున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారన్నారు. విద్యార్థుల భవిష్యత్ బాగుండాలన్న ఉద్దేశంతో దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఈ పథకాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడా ఇబ్బంది లేకుండా కొనసాగించారన్నారు. చంద్రబాబు నాడు–నేడు ఈ పథకాలను నీరు గార్చారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని, లేకపోతే నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం మెడలు వంచి నిధులు విడుదల చేయించే విధంగా పోరాడేందుకు వైఎస్సార్‌సీపీ నడుం బిగించిందన్నారు. ఈ నెల 12న నిర్వహించే యువత పోరుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. వైస్సార్‌సీపీ వెంకటగిరి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ మేరిగ మురళి, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అశ్రిత్‌రెడ్డి, నాయకులు వెంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.2.46 కోట్లకు టోకరా

- బాధిత మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు

నెల్లూరు (క్రైమ్): ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో నగదు పెట్టుబడి పెడితే ఆదాయం బాగా వస్తుందని నమ్మించి రూ.2.46 కోట్లు దోచేసిన ఘటనపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పొగతోటకు చెందిన ఓ మహిళకు ఇటీవల ఇన్‌స్ట్రాగామ్‌లో ఆన్‌లైన్ ట్రేడింగ్‌పై లింకు వచ్చింది. ఆమె క్లిక్ చేయగా ఆమె వాట్సాప్ నంబర్‌కు నిషా బసు అనే మహిళ మెసేజ్ పంపి తాను మైరే అసెట్ షేర్‌ఖాన్ కంపెనీకి చెందిన దానినని పరిచయం చేసుకుంది. ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో లాభాలు వచ్చేందుకు సలహాలు, సూచనలిస్తామని నమ్మబలికి తమ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని మహిళకు సూచించింది. ఆమె మాటలను నమ్మి ఆ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని, అందులో తన పాన్, ఆధార్, బ్యాంకు వివరాలను పొందుపరిచింది. ప్రారంభంలో కొంత మొత్తం నగదు పెట్టుబడి పెట్టించి ట్రేడింగ్‌లో ఆదాయం వచ్చేలా చేసి ఆమెను నమ్మించారు. పెద్ద మొత్తంలో పెట్టుబడి పెడితే రెట్టింపు ఆదాయం వస్తుందని చెప్పడంతో ఆశ పడిన సదరు మహిళ అప్పు చేసి ఈ ఏడాది జనవరి 23వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు పలు దఫాలుగా రూ.2,46,30,396 డిపాజిట్ చేశారు. వారు అకౌంట్‌లో రూ.4,02,24,759 నగదు ఉన్నట్లు ఆమెకు చూపించారు. ఆదాయం వచ్చిందనుకున్న ఆ మహిళ ఈ నెల 3వ తేదీన నగదు డ్రా చేసేందుకు యత్నించగా అవి కాలేదు. కంపెనీ కస్టమర్ కేర్‌కు సంప్రదించగా కమిషన్, ఏడీఎంఎల్ డిపాజిట్, లార్జ్‌ట్రాన్సక్షన్స్ కోసం కొంత మొత్తం డిపాజిట్ చేస్తే మొత్తం నగదు విత్‌డ్రా చేసుకోవచ్చని చెప్పారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు ఈ నెల 6వ తేదీ ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆదివారం బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

శోభాయమానంగా గిరిపరిక్రమణ



గిరిపరిక్రమణకు ఉభయదేవేరులతో కలిసి కొండ దిగి వస్తున్న శ్రీవారు

- గోవింద నామస్మరణతో మార్మోగిన బిలకూట క్షేత్రం

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా గిరిప్రదక్షణ ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భగవంతుడికి భక్తుడిని చేరువ చేసేందుకు రమణ మహర్షి సూచించిన గిరిప్రదక్షణను అరుణాచలంలో ఘనంగా నిర్వహిస్తారు. ఆ సంప్రదాయాన్ని ఇక్కడ కూడా అమలు చేయాలనే సంకల్పంతో ఎనిమిదేళ్ల నుంచి కొండ చుట్టూ గిరిపరిక్రమణ నిర్వహిస్తున్నారు. వేకువనే ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రసన్నుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సుముహూర్తంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి, ఉభయదేవేరుల ఉత్సవ మూర్తులతో వేదపండితులు వేదనాదం చేస్తుండగా, మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణ మధ్య స్వామివారు కొండ దిగి కిందకు వచ్చారు. అలంకార ప్రియుడైన స్వామివారు ఉభయ దేవేరులతో కలిసి కొండ దిగగా గోవింద నామాలు కీర్తిస్తూ భక్తులు సవ్య దిశలో కొండ చుట్టూ ప్రదక్షణ చేశారు. గోవింద నామస్మరణలు, అన్నమయ్య కీర్తనలు, కోలాట ప్రదర్శనల నడుమ కొండ చుట్టూ భక్తులు చేసిన పరిక్రమణ ఆద్యంతం భక్తి పారవశ్యంతో సాగింది. భగవంతుడి సత్సంగంలో భాగమైన స్మరణ, స్తోత్రం, దర్శనం, సన్నిధి నివాసం, తదితర క్రియల్లో గిరి ప్రదక్షణే అత్యంత శక్తి వంతమైనదని ఈ సందర్భంగా అర్చకులు తెలిపారు. కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి దంపతులు, ఆర్డీఓ వంశీకృష్ణ దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తొలిసారి ఉత్సవ మూర్తులతో..

బిలకూట క్షేత్రంలో ఎనిమిదేళ్ల క్రితం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభించగా గతేడాది వరకు స్వామివారి నిలువెత్తు చిత్రపటంతోనే భక్తులు కొండ చుట్టూ సవ్య దిశలో ప్రదక్షిణ నిర్వహించేవారు. ఈ దఫా మాత్రం స్వామివారు, దేవేరుల ఉత్సవ మూర్తులతో గిరిపరిక్రమణ నిర్వహించగా భక్తులు భారీగా తరలివచ్చారు.

ధీమానా?.. ధిక్కారమా!

జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యేల అండ ఉంటే ప్రభుత్వ ఉత్తర్వులు సైతం చిత్తు కాగితాలుగా మారిపోతున్నాయి. ప్రభుత్వ ఆదేశాలకే దిక్కు లేకుండా పోవడం చూసి అధికార యంత్రాంగమే విస్తుపోతోంది. గత ప్రభుత్వంలో మంజూరైన రోడ్ల నిర్మాణ పనులు 25 శాతం పూర్తి కాని వాటిని రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులు నెల్లూరు– మైపాడు రహదారికీ వర్తిస్తాయి. సదరు కాంట్రాక్టర్ ఇద్దరు అధికార పార్టీ ఎమ్మెల్యేల అండతో ప్రభుత్వ ఆదేశాలను తుంగలో తొక్కి ఎంచక్కా రోడ్డు వర్క్ చేస్తున్నాడు. షాడో ఎమ్మెల్యేలకు ముడుపులు ఇవ్వడంతో అధికార యంత్రాంగం కాంట్రాక్టర్ ముందు మోకరిల్లింది.

- ప్రభుత్వ ఆదేశాలు.. చిత్తు కాగితాలతో సమానం
- మైపాడు రోడ్డు పనులు రద్దు చేసినా.. కొనసాగిస్తున్న కాంట్రాక్టర్
- 5 శాతం ఎక్సెస్‌తో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్
- షాడో ఎమ్మెల్యేకు ముడుపులు ఇచ్చుకుని యథేచ్ఛగా పనులు
- అనుమతి లేకుండా పనులు జరుగుతున్నా అధికారులు మౌనం
- అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాసిరకంగా నిర్మాణం



నెల్లూరు– మైపాడు రోడ్డుకు క్యూరింగ్ చేస్తున్న కూలీలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు– మైపాడు రోడ్డు పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ రద్దయిన పనులను ఎంచక్కా కానిచ్చేస్తున్నాడు. గతంలో ఆ వర్కుకు టెండర్లు వేసిన సమయంలో కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి ముగ్గురు కలిసి 5 శాతం ఎక్సెస్ ధరకు పనులు దక్కించుకున్నారు. రూ.48 కోట్ల (సీఆర్‌ఐఎఫ్) నిధులతో నెల్లూరు – మైపాడు రోడ్డును అభివృద్ధి చేసేందుకు రెండేళ్ల క్రితం టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌కు అప్పగించారు. రెండేళ్లలో పూర్తి చేయాలని గడువు విధించారు. ప్రభుత్వం మారడంతో ఆ వర్క్ నెల్లూరు డివిజన్ పరిధిలో జరుగుతున్నా.. కోవూరు డివిజన్ పరిధిలోకి మార్పు చేసుకున్నారు. తర్వాత కూటమి ప్రభుత్వం 25 శాతం కంటే తక్కువ పని చేసిన వర్క్‌లను రద్దు చేయాలని ఆదేశించింది. ప్రభుత్వం ఈ ఆదేశాలిచ్చే సరికి దాదాపు 10 శాతం కూడా ఆ రోడ్డు పని పూర్తి కాలేదు. రద్దయిన పనుల జాబితాలోకి ఆ పని కూడా వచ్చింది. కానీ సదరు కాంట్రాక్టర్ ఇద్దరు అధికార పార్టీ ఎమ్మెల్యేల ద్వారా రాజకీయ ఒత్తిడి తెచ్చి రద్దయిన పనిని కూడా చేస్తున్నాడు.

షాడో ఎమ్మెల్యే పాత్ర కీలకం

మైపాడు రోడ్డు అభివృద్ధి పనులు గతంలో చేపట్టిన సిండికేట్‌లోని ముగ్గురిలో ఒకరు మిగతా ఇద్దరు కాంట్రాక్టర్ల వద్ద ఎక్సెస్ ధర మేర ముడుపులు తీసుకుని రద్దయిన పనిని పూర్తి చేయించేలా కోవూరు షాడో ఎమ్మెల్యేతో ఒప్పందం చేసుకున్నారు. ఈ రోడ్డు నిర్మాణ పరిధిలోకి వచ్చే ఇద్దరు ఎమ్మెల్యేల ద్వారా ఆ శాఖ మంత్రికి చెప్పించుకుని రోడ్డు పనిని అనధికారికంగా పూర్తి చేయిస్తున్నారని తెలిసింది. ప్రభుత్వ ఉత్తర్వులకే దిక్కులేకపోవడంతో మిగిలిన కాంట్రాక్టర్లు విస్తుపోతున్నారు.

అడ్డదారుల్లోనైనా..

నెల్లూరు–మైపాడు రోడ్డు 10 శాతం పనులు మేర జరిగిన నేపథ్యంలో రద్దు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో.. అనధికారికంగా మరో 15 శాతం పనులు పూర్తి చేస్తున్నారు. 10 శాతం పనుల జాబితాలో ఈ రోడ్డు ఉండడంతో.. అడ్డదారుల్లో వెళ్లి ఆ పనిని ఆ జాబితా నుంచి తప్పించారని సమాచారం. ఇటీవల జిల్లాకు వచ్చిన సదరు శాఖ మంత్రిని ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు కలిసి ఆ పని రద్దు కాకుండా పనులు సజావుగా జరిగేలా చూడాలని కోరినట్లు తెలిసింది. అధికారికంగా ప్రభుత్వం రద్దు చేసిన నేపథ్యంలో 25 శాతం పనులు జరిగినట్లు ధ్రువీకరించి కోర్టు ద్వారా అయినా కాంట్రాక్ట్‌ను చేజారుచ్చుకోకుండా చూసుకునేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు.

నాణ్యతకు నీళ్లు

మైపాడ్ రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యతకు నీళ్లొదిలారు. సంబంధిత శాఖ ఇంజినీర్లు రద్దయిన రోడ్డు నిర్మాణ పనుల జోలికి వెళ్లకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా చేస్తున్నారు. ఇప్పటికే రోడ్డు మార్జిన్‌లో ఉన్న గ్రావెల్‌ను రియల్ వెంచర్లకు తోలి రూ.కోట్లు కొల్లగొట్టారు. పనులు కూడా కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం మైపాడు రోడ్డు పనులు రద్దయింది వాస్తవమేనని ఒప్పుకుంటున్నారు. కానీ అధికార పార్టీ ఎమ్మెల్యేల ప్రమేయం ఉండడంతో తామేమి చేయలేమని చేతులెత్తేస్తున్నారు. రోడ్డు పనులు ఆపే శక్తి తమకు లేదని అధికారులు చెప్పడం చూస్తుంటే కాంట్రాక్టర్ పవర్ ఏమిటో ఇట్టే తెలిసిపోతుంది.

క్లుప్తంగా

బాలుడి మృతదేహం లభ్యం

నెల్లూరు(క్రైమ్): పెన్నాలో ఈతకెళ్లి ప్రమాదవశాత్తూ గల్లంతైన బాలుడి మృతదేహం ఆదివారం లభ్యమైంది. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని మనుమసిద్ధినగర్‌కు చెందిన శరవణ్, కౌముది దంపతుల కుమారుడు సాయికుమార్ (14) మూలాపేటలోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఇంట్లో తల్లిదండ్రుల్లేకపోవడంతో స్కూటీలో పెన్నా వద్దకు శనివారం సాయంత్రం వెళ్లారు. గొబ్బెమ్మలు పండగ జరిగే ప్రదేశం వద్ద స్కూటీని నిలిపి నదిలో ఈతకెళ్లి ప్రమాదవశాత్తూ గల్లంతయ్యారు. సాయికుమార్ కనిపించకపోవడంతో గాలింపు చర్యలను కుటుంబసభ్యులు చేపట్టారు. ఈ క్రమంలో గుర్తుతెలియని బాలుడి మృతదేహం పెన్నాలో ఉందనే సమాచారం అందుకున్న వారు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని చూసి సాయికుమార్‌గా గుర్తించి గుండెలవిసేలా రోదించారు. అనంతరం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి ఎస్సై బాలకృష్ణ చేరుకొని, స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. కేసు నమోదు చేశారు. పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుపూరు సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. నెల్లూరులోని అయ్యప్పగుడి ప్రాంతానికి చెందిన అన్వర్‌బాషా పని నిమిత్తం బైక్‌పై కసుమూరు వెళ్లారు. తిరిగి బయల్దేరగా, కసుపూరు సమీపంలోని మలుపు రోడ్డు వద్ద ఆటో అడ్డురావడంతో బైక్ అదుపుతప్పింది. గాయపడిన ఆయన్ను చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు.

నిమ్మ మార్కెట్‌కు సెలవు రేపు

పొదలకూరు: స్థానిక ప్రభుత్వ నిమ్మ మార్కెట్ యార్డుకు సెలవును మంగళవారం ప్రకటించామని వ్యాపారుల అసోసియేషన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. హోలీ సందర్భంగా ఉత్తరాది రాష్ట్రాల్లో మార్కెట్లు ఉండవని, ఈ కారణంగా సెలవును ప్రకటించామన్నారు. బుధవారం యథాతథంగా సెలవు ఉంటుందని చెప్పారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	92
లేయర్ (లైవ్)	90
బ్రాయిలర్ చికెన్	170
బ్రాయిలర్ స్కిన్‌లెస్	190
లేయర్ చికెన్	153

నిమ్మ ధరలు



పెద్దవి	రూ.90
సన్నవి	రూ.60
పండ్లు	రూ.40

రుధిరదారులు



అభివృద్ధికి చిహ్నాలైన రహదారులు నెత్తురోడుతున్నాయి. సవ్యంగా లేని రోడ్లు.. వాహనాలను నిర్లక్ష్యంగా నడిపే చోదకులు.. భద్రత నిబంధనలపై అవగాహలేమి.. కారణాలేమైతేనేం రుధిరదారులుగా మారుతున్నాయి. ఆనందంగా సాగిపోతున్న ప్రయాణాల్లో అంతలోనే అంతులేని విషాదం కమ్మేస్తోంది. కన్నవారిని, కడుపున పుట్టిన వారిని కోల్పోయిన కుటుంబాలు కుమిలిపోతున్నాయి. ఎంతోమంది శాశ్వత వైకల్యం బారిన పడి జీవితాంతం బాధపడుతున్నారు. 68 రోజుల వ్యవధిలో 44 మందికిపైగా మృతి చెందారంటే సమస్య తీవ్రత ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

జిల్లా పరిధిలోని రోడ్లపై నిత్యం ప్రమాదాలు

- గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- వీడని నిర్లక్ష్యం.. భద్రతలో అలక్ష్యం
- 68 రోజుల్లో 44 మందికిపైగా మృత్యువాత

నెల్లూరు(క్రైమ్): రోడ్లెక్కాక ఇంటికి క్షేమంగా చేరుతామో.. లేమోననే మీమాంసలో వాహనచోదకులున్నారు. జిల్లా పరిధిలోని రోడ్లపై నిరంతరం ప్రమాదాలు చోటుచేసుకుంటూ.. ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండగా, పదుల సంఖ్యలో క్షతగాత్రులవుతున్నారు. మితిమీరిన వేగం.. ఓవర్‌టేకింగ్.. అకస్మాత్తుగా వాహనాలను నిలపడం.. నిద్ర లేమి.. మద్యం మత్తు.. సెల్‌ఫోన్ డ్రైవింగ్.. ట్రాఫిక్ నిబంధనల అతిక్రమణ.. పరిమితికి మించి ప్రయాణం.. రాంగ్‌రూట్‌లో రాకపోకలు.. ఇలా ప్రమాదాలకు కారణాలెన్నో. కొన్ని సందర్భాల్లో గమ్యస్థానానికి సకాలంలో చేరాలనో.. అందరి కంటే ముందుగా వాహనాన్ని చేర్చాలనో.. అత్యవసర పనో.. మరో బాడుగ ఉందనో వాహనాలను వేగంగా నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు.

అంతా అస్తవ్యస్తం..

జాతీయ, రాష్ట్ర రహదారులు కొంతవరకు బాగానే ఉన్నా.. జిల్లా, మండల, గ్రామీణ రహదారులు గుంతలు పడి దుర్భరంగా మారాయి. రోడ్లపై నిర్దిష్ట పార్కింగ్ ప్రాంతాల్లో కాకుండా ఎక్కడపడితే అక్కడ వాహనాలను ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారు. అప్రమత్తం చేసేలా ఇండికేటర్లు, స్టిక్కరింగ్‌తో కూడిన ట్రయాంగిల్ గుర్తులనూ వాడకపోవడంతో వెనుకొచ్చే వారికి కనిపించక వేగంగా ఢీకొని ప్రాణాలు కోల్పోతున్నారు. వాహనాల ముందు, వెనుకా పసుపు, ఎరుపు రంగులతో రేడియం స్టిక్కర్లున్నా, అధిక శాతం నాసిరకంగా మారాయి. దుమ్మూ, ధూళితో ఉండటంతో చీకట్లో వాహనం ఉందో లేదో తెలుసుకోలేని పరిస్థితి నెలకొంటోంది.



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనం

స్టీరింగ్ పడుతున్న క్లీనర్లు

క్లీనర్లు అరకొరా డ్రైవింగ్‌తో వాహనాలను అప్పుడప్పుడూ నడుపుతూ పట్టు కోల్పోయి ప్రమాదాలకు కారణమవుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి రోజుల తరబడి వాహనాలను నడుపుతూ నిద్రమత్తుకు గురై ప్రమాదాలకు కారకులవుతున్నారు. వీరు ప్రాణాలను కోల్పోవడమే కాకుండా ఎదుటి వారి ప్రాణాలనూ బలిగొంటున్నారు.

మొక్కుబడి చర్యలు

జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే 54 బ్లాక్ స్పాట్లను అధికారులు గుర్తించారు. ఇందులో ఉలవనాడు – మనుబోలు (ఎన్‌హెచ్ – 16)పై 45.. కృష్ణపట్నం – బద్వేల్ (ఎన్‌హెచ్ – 67)పై ఏడు.. ఇతర రహదారుల్లో మరికొన్నింటిని కనుగొన్నారు. ఆయా ప్రాంతాల్లో ఇసుక డ్రమ్ములు, బ్యారికేడ్లు, మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లు, సోలార్ విద్యుద్దీపాలు, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని రోడ్డు భద్రత సమావేశాల్లో అధికారులు తీర్మానించారు. కొన్ని ప్రాంతాల్లో మినహా అవి మరెక్కడా కానరావడంలేదు. వేగ నియంత్రణ, బ్లాక్ స్పాట్ల వద్ద నిర్దిష్ట చర్యలు, రోడ్డు సేఫ్టీ కమిటీ నిర్ణయాల అమలుపై పోలీస్, రవాణా శాఖ అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఫేస్‌వాష్‌కు బ్రేక్..

నిద్రమత్తులో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని గుర్తించిన అధికారులు వాహన డ్రైవర్లకు ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అప్పట్లో ప్రమాదాలు తగ్గుముఖం పట్టగా, కాలక్రమంలో ఆ ప్రక్రియకు బ్రేక్‌పడింది.

ఇటీవల జరిగిన ప్రమాదాలు

- సుందరయ్య కాలనీ సమీపంలోని జాతీయ రహదారిపై కారు మితిమీరిన వేగంతో వస్తూ ముందు వెళ్తున్న ఆటోను ఢీకొంది. ఘటనలో ఆటోలోని ఇద్దరు మృతి చెందగా, ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు.
- ఇన్నోవా డ్రైవర్ నిద్రమత్తులో వాహనాన్ని నడుపుతూ భగత్‌సింగ్‌కాలనీ సమీపంలో డివైడర్‌ను శనివారం తెల్లవారుజామున ఢీకొని.. గూడూరు వైపు వెళ్లే లారీని ఢీకొట్టారు. ఈ ఘటనలో అక్కాతమ్ముడు మృతి చెందగా, వారి తల్లిదండ్రులు, డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు.
- సంగం మండలంలో ఆటోను పల్లెవెలుగు బస్సు జనవరిలో ఢీకొనడంతో వెంకటశేషయ్య, వరలక్ష్మి దంపతులు మృతి చెందారు.

ఇలా చేస్తే.. కొంత మేలు

- జాతీయ రహదారిపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలపకుండా చూడాలి. రాత్రి వేళ వాహనచోదకుడికి ముందు వాహనం ఉందనే విషయాన్ని స్పష్టంగా కనిపించేలా చేయాలి.
- వేగ నియంత్రణ, మద్యం మత్తులో వాహనాలు నడపకుండా చూడాలి. అతివేగంతో దూసుకెళ్లే వాహనాలను నిఘా కెమెరాలతో గుర్తించి వెంటనే కళ్లెం వేయాలి. సంబంధిత వాహన యాజమాని సెల్‌ఫోన్‌కు సందేశం పంపి అప్రమత్తం చేయాలి.
- డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించాలి. అనుభవం లేని వారు వాహనాలను నడుపుతుంటే కేసులు నమోదు చేయాలి.
- ద్విచక్రవాహనచోదకుడైతే హెల్మెట్.. కారులోని వారు సీట్ బెల్టును విధిగా ధరించేలా చూడాలి. నిబంధనల ఉల్లంఘనలపై కొరడా ఝుళిపించాలి.
- ఫేస్ వాష్ కార్యక్రమాన్ని పునరుద్ధరించాలి.
- హైవే పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించేలా చూడాలి.

అర్ధాంతరంగా తనువు చాలించి..

- వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య

నగరంలో జరిగిన వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. భర్త వేధింపులను తాళలేక వివాహిత.. భార్య మృతిని తట్టుకోలేక భర్త బలవన్మరణం చెందారు. ఈ ఘటనలు ఆయా కుటుంబాల్లో శోకాన్ని మిగిల్చాయి. – నెల్లూరు(క్రైమ్)

భార్య మృతిని తట్టుకోలేక..

భార్య మృతిని తట్టుకోలేక భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేటలోని రాజీవ్‌గృహకల్పకు చెందిన వేణుగోపాల్(50) సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. కుమారుడు తరుణ్‌కుమార్ చెన్నైలో.. కుమార్తె హర్షిణి హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తున్నారు. వేణుగోపాల్ భార్య లక్ష్మీదేవి ఇంటి పైనుంచి ప్రమాదవశాత్తూ కిందపడటంతో గతేడాది డిసెంబర్‌లో మృతి చెందారు. అప్పటి నుంచి ఆయన ఒంటరిగా ఉంటూ.. భార్య మృతిని జీర్ణించుకోలేక మానసికంగా బాధపడసాగారు. పిల్లలతో రోజూ ఫోన్లో మాట్లాడే ఆయన శుక్రవారం చేయలేదు. పలుమార్లు వారు ఫోన్ చేసినా, స్పందించకపోవడంతో నెల్లూరుకు శనివారం చేరుకున్నారు. ఇంటి తలుపునకు లోపలి నుంచి గడియపెట్టి.. గ్రిల్స్‌కు తాళమేసి ఉండటంతో పగలగొట్టి వెళ్లారు. బాత్‌రూమ్‌లో స్పృహ కోల్పోయి కొన ఊపిరితో ఉన్న తండ్రిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. ఆయన విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారనే అంశం వైద్యపరీక్షల్లో తేలింది. చికిత్స పొందుతూ మృతి చెందారు. చిన్నబజార్ పోలీసులకు మృతుడి కుమారుడు తరుణ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులు తాళలేక

భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పొర్లుకట్టలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. కందుకూరుకు చెందిన సమీనా (37)కు పొర్లుకట్టకు చెందిన మున్వర్‌తో వివాహం కాగా, వీరికి వహీరా, అక్బర్ సంతానం. రోడ్డు ప్రమాదంలో మున్వర్ 2016లో మృతి చెందడంతో అప్పటి నుంచి నగరంలోని ఓ జిరాక్స్ సెంటర్‌లో పనిచేసుకుంటూ పిల్లలను సమీనా పోషించుకోసాగారు. పొర్లుకట్టకు చెందిన మున్నాకు ఇది వరకే వివాహమై భార్య నుంచి విడిపోయి ఒంటరిగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఆయనతో సమీనాకు పరిచయమైంది. ఆమెను.. పిల్లలనూ బాగా చూసుకుంటానని నమ్మించిన మున్నా 2017లో వివాహం చేసుకున్నారు. అనంతరం పిల్లల విషయంలో వీరి మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఇంటికి అప్పుడప్పుడూ వచ్చి వెళ్లసాగారు. పొదుపులో సమీనా తీసుకున్న రూ.నాలుగు లక్షలనూ మున్నా వాడేసుకున్నారు. ఈ విషయమై వీరి మధ్య ఈ నెల ఎనిమిదిన వాగ్వాదం జరిగింది. సమీనాతో భర్త, అతని తల్లి గొడవపడ్డారు. ఇంటి నుంచి శనివారం రాత్రి ఆయన వెళ్లి, తన భార్యకు వీడియోకాల్ చేసి ఆదివారం తెల్లవారుజామున మాట్లాడారు. ఆపై హాల్లోని సిమెంట్ రేకులకు సపోర్ట్‌గా ఉన్న ఇనుప పైపునకు చీరతో ఆమె ఉరేసుకున్నారు. గమనించిన కుమారుడు పెద్దగా కేకలేయడంతో స్థానికులు అక్కడికి చేరుకొని సమీనాను కిందికి దించి రామచంద్రారెడ్డి హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. దీంతో అక్బర్ జరిగిన విషయాన్ని తన అమ్మమ్మ బీబీజాన్‌కు తెలియజేశారు. ఆమె తన బంధువులతో కలిసి నెల్లూరు చేరుకొని కుమార్తె మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. భర్త వేధింపులే తన కుమార్తె మృతికి కారణమని, ఆయనపై చర్యలు చేపట్టాలని సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని ఎస్సై సుల్తాన్‌బాషా పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): నెల్లూరు రూరల్ పరిధిలోని 35వ డివిజన్‌కు చెందిన పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి సమక్షంలో యాకసిరి రంజిత్ కిరణ్, 200 మంది పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. చింతారెడ్డిపాళెంలోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి పార్టీ కండువాలను కప్పి ఆయన సాదరంగా ఆహ్వానించారు. కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, ఐరెడ్డి సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, మస్తాన్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, ఆదిరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, మురళీయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో బిహార్ వాసి మృతి

ఉలవపాడు: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బిహార్ వాసి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై రాజుపాళెం – చాగల్లు మధ్య ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. బిహార్‌కు చెందిన ప్రశాంత్ (28) చాగల్లు సమీపంలోని ఓ డెయిరీలో పనిచేస్తున్నారు. ఉలవపాడు నుంచి డెయిరీ వద్దకు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా, వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో ఎగిరి రోడ్డుపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఘటన స్థలాన్ని ఎస్సై అంకమ్మ పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికులపై కూటమి కన్నెర్ర

రెక్కాడితే గానీ డొక్కాడని గని కార్మికులపై కూటమి ప్రభుత్వం కక్షగట్టింది. మైకా, క్వార్ట్జ్, క్వారీ పరిశ్రమలకు సరైన అనుమతులివ్వకుండా తొమ్మిది నెలలుగా జాప్యం చేస్తోంది. ఫలితంగా కొన్ని గనుల్లో కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోగా, మరికొన్నింట్లో నామమాత్రంగా జరుగుతున్నాయి. వాస్తవానికి వీటిపై వాచ్‌మెన్ మొదలుకొని జేసీబీ, పొక్లయిన్, ట్రాక్టర్లు, టిప్పర్లు, కార్మికులు ఎందరో ఆధారపడి జీవనం సాగించే వారు. ప్రస్తుతం వీరంతా ఉపాధి కరువై అల్లాడాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది.

మూతపడిన క్వార్ట్జ్ గనులు

- తొమ్మిది నెలలుగా ఇదే తంతు
- పనుల్లేక.. పస్తులతో విలవిల్లాడుతూ..
- పరిశ్రమపై ఆధారపడిన ఐదు వేల కుటుంబాలు



గనిలో యంత్రాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కోట్లాది రూపాయల విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించి పెట్టే మైకా గనులకు జిల్లా పెట్టింది పేరు. సైదాపురం మండలంలో అపారమైన ఖనిజ నిక్షేపాలున్నా.. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇవన్నీ మూతపడ్డాయి. నూతన పాలసీ పేరిట వీటన్నింటినీ మూయించారు. సర్కార్ కొలువుదీరిన జూన్ 12 తర్వాత మైకా పరిశ్రమలన్నీ సిండికేట్ చేతుల్లోకి వెళ్లిపోయాయి. కొన్ని గనుల్లో నామమాత్రంగా పనులు జరుగుతుండగా, మిగిలినవి పూర్తిగా మూతపడ్డాయి. ఫలితంగా వీటిపై ఆధారపడిన ఐదు వేల కుటుంబాలకు చెందిన కార్మికులకు ఉపాధి లేక పస్తులుండాల్సిన దుస్థితి ఏర్పడింది. తమకు న్యాయం చేయాలని వేడుకుంటూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా, అధికారులు ఏ మాత్రం కనికరం చూపడంలేదు.

143 నుంచి 80కి..

గతంలో 143 గనులు పనిచేస్తుండగా, ప్రస్తుత ఈ సంఖ్య 80కి పతనమైంది. ఈ ప్రాంతంలో దొరికే మైకా, క్వార్ట్జ్, పల్స్‌పర్‌కు వివిధ దేశాల్లో మంచి గిరాకీ ఉంది. అందుబాటులో ఉన్న గనులు, క్వారీలకు అనుసంధానంగా పది ఫ్యాక్టరీలున్నాయి. వీటి ద్వారా ప్రత్యక్షంగా 15 వేల మంది.. పరోక్షంగా మరో 15 వేల మంది ఉపాధి పొందుతున్నారు. వీరిలో 90 శాతం మంది జిల్లా వాసులే.

అందరిపైనా ప్రభావం

కూటమి ప్రభుత్వం కొలువుదీరాక నూతన పాలసీ అంటూ కాలయాపన చేస్తోంది. తాము చెప్పేంత వరకు మైకా పరిశ్రమలకు ఎలాంటి అనుమతులు గానీ కార్యకలాపాలు కానీ చేపట్టకూడదని అధికార వర్గాలు ఆదేశించాయి. గడిచిన తొమ్మిది నెలల్లో పల్స్‌పర్, మైకాకే పర్మిట్ ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. అక్కడా తూతూమంత్రంగానే పనులు జరుగుతున్నాయి. ఈ సంక్షోభం కార్మికులపైనే కాకుండా యాజమాన్యాలపై సైతం ప్రభావం చూపుతోంది. ఇక్కడ లభించే అపారమైన ఖనిజాలను ఇతర రాష్ట్రాలతో పాటు వివిధ దేశాలకు నిత్యం ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం క్రయవిక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. మైకా పరిశ్రమ తీవ్ర నష్టాల్లో కూరుకుపోయింది.

ఆశలు.. అడియాశలు

మైకా పరిశ్రమపై ఆధారపడి సైదాపురం, పొదలకూరు, గూడూరు మండలాల్లో కార్మికులు అధికంగా ఉన్నారు. తొమ్మిది నెలలుగా పనుల్లేక ఆకలి కేకలతో వీరు అలమటిస్తున్నారు. పిల్లల స్కూల్ ఫీజులను సైతం చెల్లించలేని దీనావస్థలో ఉన్నారు. మరో వైపు గని కార్మికుల్లో అధిక శాతం మంది కూటమి ప్రభుత్వానికే ఓటేశారు. దీంతో గతానికి భిన్నంగా గత ఎన్నికల్లో సైదాపురం మండలంలో భారీ మెజార్టీ వచ్చింది. తమకు మంచి జరుగుతుందనే వీరి ఆశలు అడియాశలయ్యాయి. మైకా పరిశ్రమలకు వెళ్లే కూలీలతో తెల్లవారుజాము నుంచే కళకళలాడే సైదాపురం నేడు బోసిపోయింది. రవాణా వ్యవస్థ పూర్తిగా నిలిచిపోవడంతో వాహన యాజమానులతో పాట లోడింగ్ చేసే కూలీలూ ఇబ్బంది పడుతున్నారు. దీంతో కార్మికులంతా ఒక్కటై తమకు న్యాయం చేయాలంటూ సైదాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. మైకా పరిశ్రమ పూర్తిగా ఓ ముఖ్యనేత కనుసన్నలోకి వెళ్లిపోయిందని, రాష్ట్ర ప్రభుత్వం సైతం సదరు వ్యక్తికే అప్పజెప్పడంతో ఈ రంగం కుదేలైందని వారు ఆరోపిస్తున్నారు.

బతుకులు నాశనం చేశారు

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మా జీవితాలను నాశనం చేశారు. మా ఊరి దగ్గర్లోని మైకా గనికి కూలీ పనులకెళ్తూ 45 ఏళ్లుగా జీవనం సాగించేవాళ్లం. తొమ్మిది నెలలుగా గనులను మూసేయడంతో పనుల్లేక అల్లాడుతున్నాం. – రాజమ్మ

కూలీ పనులు దొరకడంలేదు

యాజమాని వారానికోసారి మా ఖాతాల్లోకి గానీ నేరుగానో డబ్బులిచ్చేవారు. అయితే ప్రస్తుతం ఉపాధి కరువైంది. పనులు దొరకడం గగనంగా మారింది. కుటుంబాన్ని పోషించుకోవడం కష్టతరంగా మారింది. కూటమి ప్రభుత్వమొచ్చాకే ఇలా జరుగుతోంది. – సుబ్రహ్మణ్యం

వీధిన పడ్డాం

గ్రామాల సమీపంలోని క్వారీల్లో పనులకెళ్లి ఎంతో కొంత డబ్బులు సంపాదించే వాళ్లం. అయితే ప్రస్తుతం పనుల్లేక వీధిన పడ్డాం. మా బతుకులను రోడ్డున పడేశారు. వెంటనే గనులకు అనుమతులిచ్చి కష్టాలను తీర్చాలి. – చెంచయ్య



తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికుల ఆందోళన (ఫైల్)